అమ్మో పాపం!

శ్రీమతి న్యాయపతి కమలారాంజీ

మంగతాయారుకి కబుర్లంటే ప్రాణం. ఆవిడ కబుర్లంటే చాలు చెవి కోసుకుంటుంది. ఎంతసేపైనాసరే ఇంట్లో పన్లు కూడా మానేసి కబుర్లు చెప్తూ కూర్చుంటుంది. ఆవిడ కబుర్లు వినేవాళ్ళు దొరకాలి. ఆవిడకి కబుర్లు చెప్పేవాళ్ళు దొరకాలేగానీ వళ్ళు పై తెలీదు. ఇంటి పని, వంట పని ఏమీ అక్కర్లేదు.

ఎవరు వంగుని వంకాయ తిన్నారో, తొంగొని దోసకాయ తిన్నారో, నించుని నిమ్మకాయ తిన్నారో అవన్నీ ఆవిడకే కావాలి. ఎవరింట్లో అత్త కోడలు దెబ్బలాడుకున్నారో, ఎవరింట్లో మగాడు తాగి రాత్రిళ్ళు ఇంటికి అలస్యంగా వస్తున్నాడో, ఎవరింట్లో మొగుడు పెళ్ళాన్ని కొట్టాడో అవన్నీ తెలుసుకోకపోతే ఆవిడకి అన్నం సహించదు, నిద్ర పట్టదు.

మంగతాయారుకి ఇద్దరు కొడుకులు. ఇద్దరూ వాజమ్మలే. వెర్రివెధవలు. వాళ్ళని అలా తీర్చిదిద్దింది ఆవిడ. ఆవిడ స్టో మీద భారీ శరీరం ఆవిడది. ఈ కాలిటు ఆ కాలటు బార్లా చాపుకుని గుండెల మీద రెండు చేతులు పెట్టుకుని రాత్రి గుర్రుపెట్టి పడుకుందంటే ఉదయం లేచేసరికి ఎనిమిదయిపోతుంది. ఆవిడ లేచే లోగా ఇంట్లో చాలా మట్టుకు పన్లు కుర్రవెధవలిద్దరూ చెయ్యాల్సిందే. లేకపోతే ఆవిడిద్దర్నీ రెండు మొత్తులు మొత్తుతుంది. "వెధవల్లారా! కంచాలక్కంచాలు లాగించేస్తారు. ఆ మాత్రం పనీ చెయ్యలేరూ!" అంటూ ఆవిడ డెబ్బలకంటే ఆవిడ భారీ శాల్తీకి ఎక్కువ జడుస్తారు వాళ్ళు పాపం.

వాళ్ళింట్లో కందిపప్పు, మినప్పప్పు, పంచదార, గోధుమ నూకల్లాంటివి డబ్బాల్లో వుండవు. అవి అయిపోయినదాకా అలా పొట్లాలతోనే వుంటాయి. ఆవిడకి శుభ్రం అంటే ఏమిటో తెలీదు మరి. కానీ ఎవరైనా చూస్తారేమోనని చిన్న ఇది వుంది. ఎందుకంటే ఇంట్లో ఎక్కడపడితే అక్కడ దొర్లే ఆ పొట్లాలని ఎవరైనా వస్తే మటుకు మంచం కిందకి తోసేస్తుంది. అప్పటిదాకా ఆ పొట్లాలని అనుకుని వున్న చీమలన్నీ ఎటు వెళ్ళాలో తెలీక అపజప (అయోమయం) అయిపోయి అక్కడ కూర్చున్న వాళ్ళని తెగ కుట్టేయడం మొదలు పెడతాయి.

బియ్యం పెట్టేసి, ఏయే పన్లు చెయ్యాలో కొడుకులకి పురమాయించేసి ఇరుగు పొరుగుల ఇళ్ళకి పెత్తనాలకి వెళ్ళిపోతే పెద్దవాడు కూరలు తరుగుతాడు. రెండో వాడు అన్నం గిన్నె దింపుతాడు. కూరకి పోపు పెడతాడు పెద్దవాడు. చారు పెడతాడు రెండోవాడు. మొత్తం మీద ఇద్దరూ కలిసి వంట చేసేస్తారు. పొద్దున్నే లేచి వీధి గుమ్మంలో ముగ్గు పెట్టడం కూడా వంతులు వేసుకుని చేసేస్తారు వాళ్ళిద్దరూ. ఎందుకంటే ఆవిడ తన 130 కేజీల బరువుని మంచం మీంచి దింపడానికి చాలా కష్టపడుతుంది. అంతటి

"ఏమిటండీ ఇన్ని చీమలు మీ ఇంట్లో?" అని అడిగితే

"వెధవ చీమలు, పక్కవాళ్ళ చీమలన్నీ మా ఇంట్లోనే. వాళ్లేదో చీమల మందు జల్లేరట అవన్నీ ఇక్కడకొచ్చేశాయి. ఏం చెయ్యడం?" అంటుంది.

రావి ఆకు కథ



రావిచెట్టుకు 2300 సంవత్సరాల చరిత్ర వుంది. ఆంగ్లంలో 'పీపల్ ట్రీగా', హిందీలో 'పిపల్' గా తెలుగులో 'రావి' గా ప్రసిద్ధ నామం గల ఈ ఆకుకు బుద్ధుని జీవితానికి సంబంధం వుంది.

గౌతమబుద్ధుడు 'జ్ఞానోదయం' పొందిన బోధి వృక్షం నుంచి చిన్న శాఖను త్రుంచి, అశోక చక్రవర్తి, దానిని తన కుమార్తె సంఘమిత్ర ద్వారా ఒక బంగారు పాత్రలో వుంచి శ్రీలంకకు పంపాడు. అది అక్కడ తిరిగి మొలకెత్తి మహావృక్షంగా పెరిగింది. గత 2300 సం॥గా ఆ చెట్టు అక్కడ పూజలందుకుంటోంది.

రావి చెట్టు మీద బ్రహ్మ విష్ణు మహేశ్వరులుంటారని హిందువుల నమ్మకం. దక్షిణాదిన శివాలయాల్లో ఈ రావి చెట్టు, మారేడు చెట్లు ఎక్కువగా ఉంటాయి. రావి ఆకులు ఆయుర్వేద వైద్యానికి పనికి వస్తాయి. ఈ ఆకును అదృష్ట పత్రంగా భావిస్తారు శ్రీలంకీయులు.

ప్రముఖ ప్లాంటేషన్ అడ్వయిజర్, టెక్నికల్ అడ్వయిజర్ ఫర్ ఇంటర్నేషనల్ టీ సొసైటీ, శ్రీలంక, ఇండియా, పపువా, న్యూగినియా వంటి దేశాలలో తేయాకు, యాలకులు వంటి పంటలకు అడ్వయిజర్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన కె.వి.ఎస్. కృష్ణ, టీ ఎస్టేట్స్‌లో పని చేసేవని తలచే తయారుచేయించిన రావి ఆకు డిజైన్ ఇది. -గాయత్రి

* * *

ఒకరోజు పొద్దున్నే తొమ్మిదవకుండా ఆవిడ సుభద్రింటికి వచ్చింది.

వస్తూనే "సుభద్రా! సుభద్రా!" అని కొంపలంటుకు పోయేలా గట్టిగా కేకేసింది. వంటింట్లో వున్న సుభద్ర ఆదరా బాదరాగా ఇవతలకు వచ్చింది.

"హమ్మయ్య వున్నావా! నువ్వు వుంటావో లేదోనని హడలి చచ్చాను" కిసుక్కున నవ్వి అంది తన భారీ కాయాన్ని సోఫాలో సర్దుకుని కూర్చుంటూ. సుభద్ర నవ్వలేక నవ్వుతూ "బావున్నారా?" అంటూ పలకరించింది.

"అవునే సుభద్రా! ఆ కామాక్షమ్మ కూతురు ఎవడితోనో లేచిపోయిందట కదా! అదేం పొయ్యేకాలమే. నిన్నగాక మొన్న ఆ కామాక్షి నాక్కనిపించి "తన కూతురికి పెళ్ళి సంబంధం నిశ్చయమైందని, ఏప్రిల్‌లో పెళ్ళని" చెప్పింది. ఇంతలో ఈ వార్త! నేను నమ్మలేకపోయానుకో. నిజమా కాదా అని తేల్చుకుందామని వచ్చాను. ఈ సంగతి విన్న దగ్గర్నుంచి ఒకటే ఆతృత. రాత్రంతా నిద్ర లేదనుకో ఎప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడు నీ దగ్గరకొచ్చి అసలు సంగతేమిటో కనుక్కుందామా అని ఒహటే కొట్టుకుపోయాననుకో. చక్కగా నిక్షేపం లాంటి సంబంధంట. ఆ కుర్రాడికి బ్యాంకులో పనట. బ్యాంకు ఉద్యోగం అంటే బోలెడంత జీతం. బ్యాంకు ఉద్యోగులకి ఎవరైనా కళ్ళకద్దుకుని పిల్లనిస్తారు. అలాంటిది ఆ కామాక్షి కూతురేమిటి అలా చేసింది?" మొహాన్ని ప్రశ్నార్థకంగా పెట్టి తెగ ఆశ్చర్య పోతోంది ఆవిడ. ఇంతలో సుభద్ర భర్త స్నానం చేసి వంటికి తువ్వాలు చుట్టుకుని బాత్‌రూం లోంచి ఇవతలకు వస్తూ ఎదురుగా వున్న మంగతాయారుని చూసి సిగ్గుపడిపోయి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయాడు.

"ఇప్పుడే వస్తాను" అని సుభద్ర లోపలికి వెళ్ళబోతుంటే "ఫర్వాలేదులే. కూర్చో. నేనేం పరాయిదాన్నా మీ ఆయన గదిలోకెళ్ళిపోయాడులే."

"బట్టలు తీసి ఇవ్వాలి" నసిగింది సుభద్ర మొగుడు వెళ్ళినవైపే చూస్తూ ఇబ్బందిగా.

"ఏమీ కొంప మునిగిపోదులే. తనామాత్రం బట్టలు తీసి వేసుకోలేడా ఏమిటి? ఇలా వచ్చి కూర్చో" చేసేది లేక సుభద్ర వచ్చి కూర్చుంది.

"ఇంతకీ ఈ విషయం చెప్పు ఆ కామాక్షి కూతురు" మంగతాయారు అరా తీయడం ఆపలేదు. సుభద్రకి ఏడుపొచ్చింది. "పొద్దున్నే మంచి పని హడావుడిలో వున్నప్పుడు ఈవిడ గోలేమిటి?" అనుకుంది. ఏమైనా కఠినంగా జవాబిస్తే ఇహ వూరూ వాడా చాటింపేస్తుంది "ఆ సుభద్ర వుందే దానికి బొత్తిగా మొహమాటం లేదు. ఇంటికెవరన్నా వస్తే ఎలా మాట్లాడాలో తెలీదు" అని. ఆవిడ నస పడలేక నవ్వు ముఖం పెట్టుకుని కూర్చుంది. సుభద్ర మొగుడు రామానుజం వంటింట్లోకెళ్ళి తన మటుకు తనే వడ్డించుకుని తినేసి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. పిల్లలయితే మంగతాయారు భారీ శరీరం వైపు అదోలా చూస్తూ బయటకు నడిచారు. అప్పుడు సుభద్ర అంది, "కామాక్షమ్మ కూతురు పద్మ ఎవరినో ప్రేమించింది. ఆ విషయం కామాక్షికి తెలుసు. అయినా కూతురి మాట వినకుండా ఆ అమ్మాయికి పెళ్ళి నిశ్చయం చేసేసింది. ఇంక చేసేది లేక, వాళ్ళమ్మకి నచ్చజెప్పలేక, తను ప్రేమించిన అబ్బాయిని గుళ్ళో పెళ్ళి చేసుకుంది. ఇదీ సంగతి!"

"హమ్మయ్య! ఇప్పుడు నా ప్రాణం కుదుట పడిందనుకో. అవునూ! కామాక్షి కొడుక్కి ఉద్యోగం లేదుట కదా! బంగారం లాంటి ఉద్యోగం మానేసి అదేదో బిజినెస్ పెట్టుకున్నాడట. పిడప కాలం, పిడప బుద్ధులూను. నెల తిరిగేసరికి ఎంచక్కా జీతం రాళ్ళు చేతిలో పడుతూంటే హాయిగా వుండకుండా.. అదేం పాడు రోగం. బిజినెస్ అంటే మాటలా? ఎన్నో మోసాలుంటాయి. ఎవడైనా నెత్తిన టోపీ పెట్టేసి పంపించేస్తే ఇహ అంతే. ఇంట్లో గోళ్ళు కొరుక్కుంటూ కూర్చోవాల్సిందే. అయినా మన కెందుకులే. ఎవడెలా పోతే మనకేంటి. ఎవరి కర్మకి ఎవరు కర్తలు.. ఏమంటావు?"

"ఆ అవునవును" ఇంకేమంటుంది సుభద్ర.

"అన్నట్టు ఇవాళ వంట ఏం చేశావు?"

"టమోటా పప్పు, అరటికాయ వేపుడు"

"అదేంటే కూర, పచ్చడిలాంటివి చెయ్యలేదా?"

"లేదు. పొద్దున్న పన్ల హడావిడిలో అవన్నీ చెయ్యడానికి కుదరలేదు."

"అయ్యో అన్ని రుచులు వుండాలే వంటలో. ఏది లేకపోయినా ఆరోగ్యం సరిగ్గా వుండదు. అవేవో ప్రొటీన్లట. కాల్షియంట. ఐరన్‌ట. అవన్నీ మన వంటికి అవసరమని మా ఆయన చెప్తూ వుంటారు. నేను మాత్రం శుభ్రంగా తింటాను సుమా!"

"అవును. మిమ్మల్ని చూస్తేనే తెలుస్తోంది" మనసులో అనుకుంది సుభద్ర.

"అన్నట్టు చెప్పడం మర్చిపోయాను. మొన్న నేను విశాలింటికి వెళ్ళాను. దానికి నేనంటే ఎంత ఆపేక్షనుకున్నావు! ఎంత మర్యాద. ఎంత మర్యాద. వెళ్ళిన దగ్గర్నుంచి ఒహటే మర్యాదలు. వెళ్ళగానే కాఫీ ఇచ్చింది. తర్వాత పావుగంటకల్లా టిఫిన్ ప్లేటుతో వచ్చింది. మరో గంటకల్లా అన్నిరకాలతో భోజనం పెట్టింది. భోజనం చేస్తేగాని వీల్లేదని ఒకటే బలవంతం అనుకో. నేను వద్దంటే

తలిరాకులు

రచయిత్రి :
ఉమ ఇయ్యుణ్ణి
పేజీలు : 55
వెల : రూ.50/-
ప్రాప్తిస్థానం :
వి.కె. వాణి మోహన్, జి-76/43, ప్లాట్
నెం.7, అన్నానగర్ 12 వ వీధి,
చెన్నై 600 102.
లేదా
డా॥ ఉమ ఇయ్యుణ్ణి,
P.O.Box.No.860007,
St.Augustine, Florida 32086,
U.S.A.



తలిరాకులు హృదిస్పందనాలు. కవితార సమాధురిమలు పదముల పోహళింపు రచయిత ఉమ కవితల కాకళింపు. గణన శీర్షికలు రచయిత్రి ఉమ మనోభృంగ వీచికలు. పాఠక లోకాన్ని ఉర్రూతలూగించగల సాహితీ తరంగాలు. ప్రతి శీర్షిక భావరస బంధుర ప్రతీక. 'ఆర్ద్ర స్వప్నం' నుండి గేయకథ వరకు సాగించిన పదరామణీయత హృదయద్రవిత. ఏది ఉటంకించేది. ఏదని వదిలేది? సంకీర్తనల పొందిక సంగీత, నృత్య ప్రజాపిక. సాహిత్య రసాంబుధిలో ఓలలాడు పిపాసగల వారికి తలిరాకులు ఓ నావిక. సౌందర్య భరితమైన చిత్రరామణీయకత కొట్టవచ్చినట్లుగా కనిపించే తలిరాకులకు హైలెట్. తలిరాకులు ప్రతిపాఠకుడు చదివి ఉపయుక్తలవ్వాలని నా ఆకాంక్ష.

- విద్వాన్ కో॥శ్రీ॥

వినలేదు. మర్యాదంటే అలా వుండాలి. మధ్యాహ్నం మూడో గంట కొట్టేసరికి మళ్ళీ పకోడీలు, కాఫీ. రాత్రి కూడా భోంచేసి వెళ్ళండంది. కానీ నేనే మా ఆయన నా కోసం ఎదురు చూస్తూ వుంటారని చెప్పి భోజనం చెయ్యకుండా వెళ్ళిపోయాను. పాపం విశాలి ఎంత బాధపడిందో నేనేం తినకుండా వెళ్ళిపోతున్నానని."

అప్పుడు జ్ఞాపకం వచ్చింది సుభద్రకి ఆవిడకి కాఫీ ఇవ్వాలన్న విషయం. గబగబా లేచి వంటింట్లోకి వెళ్ళి కాఫీ కలిపి స్టీలు గ్లాసునిండా పోసి తెచ్చి ఇచ్చింది. ఆవిడకి కప్పుతో ఇస్తే సరిపోదని సుభద్రకి బాగా తెలుసు. కాఫీ చూడగానే పెదవులు చప్పరించుకుంటూ అల్లంత దూరం నుంచే చేయి చాపి రెడీగా వున్న మంగతాయారు కాఫీ గ్లాసు అందుకుని ఎత్తిన గ్లాసు దించకుండా, మూతి దగ్గర్నుంచి గ్లాసు తియ్యకుండా వుఫ్ వుఫ్‌మని వూదుకుంటూనే ఒక్క చుక్క కూడా మిగలకుండా గ్లాసుడు కాఫీ తాగేసింది. ఆవిడ కాఫీ తాగే తీరు చూస్తే ఎవరికైనా కాఫీ మీద వ్యామోహం నశించిపోతుందేమో!

"కాఫీ బాగుందే. రోజూ కాఫీ నువ్వే చేస్తావా?"

"ఆ... ఏం అలా అడుగుతున్నారు?"



కూడు కోసం కుమ్ములాటలో
తోటివారిని చేరనీయక
బ్రతుకుతాడు జీవచ్ఛవుడు
ఉన్నదెక్కడ దోచుకుంటాడోనని
సాటివారిని చేరనీయక
సాగిపోతాడు ఉన్నవాడు
వెరసి మిగిలేది ఇద్దరికీ
ఒంటరి బ్రతుకే

- ఆకెళ్ళ వి. సుబ్బలక్ష్మి

"ఏం లేదు. పొద్దున్న పూట మీ ఆయన నీకు వంట పనిలో, కాఫీ కలపడంలో సాయం ఏమీ చెయ్యడా?"

"నేను అతనికి ఏ పనీ చెప్పను. నేనే చేసుకుంటాను"

సుభద్రకి అప్పుడు గుర్తొచ్చింది నిన్ననే విశాల తనక్కనబడి మాట్లాడిందన్న విషయం.

"అబ్బ ఆ మంగతాయారుని భరించడం మహా కష్టం సుభద్రా! పొద్దున్నే ఇలా సూర్యోదయం అవుతుందో లేదో అలా తయారైపోతుంది. ఎంతకీ వెళ్ళదు. నిన్ననే మా ఇంటికి వచ్చింది. నేను పెరట్లోకెళితే తను పెరట్లోకి, నేను వీధిలోకెళితే తనూ వీధిలోకి, నేను వంటింట్లోకెళితే తనూ వంటింట్లోకి వచ్చి ఏవో అచ్చెక్క బుచ్చెక్క కబుర్లు చెప్తూనే వుంది. ఆవిడకి కబుర్లు చెప్పడానికి ఒక సబ్జక్ట్ అంటూ వుండక్కర్లేదు. ఆవిడ చెప్పే కబుర్లలో ఒక్కటీ పనికివచ్చేది వుండదు. ఊరి కబుర్లన్నీ ఆవిడకే. ఎవరింట్లో ఏం వండుకున్నా ఆవిడకే కావాలి. ఎవరింట్లో ఏ తగాదా వచ్చినా ఆవిడకే సంబరం. ఆవిడకి మరేం పనీ పాటా లేదు కాబోలు. ఇంటి పని వంట పనంతా ఇంట్లో వాళ్ళ మీద పడేసి ఎంచక్కా తిరుగుళ్ళకి బయలుదేరిపోతుంది. ఒక్కొక్క రోజు ఒక్కొక్క ఇల్లు ఎంచుకుంటోంది ఆవిడ. నిన్న నేను బుక్ అయిపోయాను. ఎంతకీ వెళ్ళకపోతే ఏం చెయ్యను? మాతోపాటు కాఫీలు, టిఫిన్లు, భోజనం.. అన్నీ మాతోపాటే. ఆవిడ్ని ఎదురుగా పెట్టుకుని మేం ఎలా తినేస్తాం. కర్టసీకైనా తింటారా అని అడగాలి కదా! పొద్దున్న వచ్చిందంటే మళ్లీ రాత్రికే కదుల్తుంది. హమ్మో" విశాల మాటలు తల్చుకుని ఫక్కున నవ్వొచ్చింది సుభద్రకి.

"ఏంటి సుభద్రా! నీలో నువ్వే నవ్వేసుకుంటున్నావు? నాకూ చెప్పొచ్చు కదా. నేనూ నవ్వుతాను. హాయిగా కబుర్లు చెప్పుకోవడాలు, నవ్వుకోవడాలు అంటే నాకు భలే సరదా సుమా!"

"ఏం లేదు ఏం లేదు"మాట తప్పించాలని చూసినా ఆవిడ వదలడం లేదు.

"మీరు మొన్న విశాల వాళ్ళింటికి వెళ్ళేర్ట కదా! ఆ విషయమే నిన్న విశాల నాక్కని పించినప్పుడు చెప్పింది."

"చెప్పాను కదా! ఆ విశాల నాకెంతో మర్యాదలు చేసిందని. నేనంటే చాలా ఇష్టం

దానికి. ఆ విషయమే చెప్పి వుంటుంది అవునా?"

"ఆ అవును" మరేం చేస్తుంది సుభద్ర.

అలా నాన్ స్టాప్‌గా మాట్లాడుతూనే వుంది మంగతాయారు. భోజనాల వేళకి ఆవిడ్ని కూడా భోం చెయ్యమంది సుభద్ర. వెంటనే "ఎందుకూ? వద్దు" అని అనకుండా ఏమాత్రం మొహమాటం లేకుండా అవకాయ, చింత కాయ పచ్చడితో సహా తిని బ్రేవుమని తేన్చి చేయి కడుక్కుంటూ అంది, "పప్పు, వేపుడే చేసినా రెండు బావున్నాయిలే. ఇంకా కూర, పచ్చడి చేసి వుంటే బాగుండేది."

ఆవిడ ఎదురుగా సుభద్రకి మాటలు రావడం లేదు. ఆవిడ సుత్తి భరించడం కష్టంగా వుంది. మళ్ళీ కబుర్లు మొదలు పెట్టింది. ఆ కబుర్లకి అంతూ పొంతూ వుండదు. ఆవిడ ఇంత తొందరగా కదిలేట్టు లేదు. అప్పుడే మధ్యాహ్నం మూడు దాటింది. ఈజీగా అయిపోతుందని ఉప్మా చేసింది సుభద్ర. సుభద్ర వెనకాలే వంటింట్లోకి వచ్చింది మంగతాయారు.

"ఉప్మా ఎలా చేస్తున్నావు?"

"ఎలాగో ఒకలాగ. ఇంత పేస్టు చేసి మీ మొహాన తగలేస్తాను. మీకేమన్నా అభ్యంతరమా?" అందామనుకుంది. కానీ బాగుండదని వూరుకుంది.

"అల్లం, పచ్చిమిరపకాయలు, కరివేపాకు వేసేవా?"

"ఆ"

ఉల్లిపాయలు కూడా వెయ్యి బాగుంటుంది."

"ఉల్లిపాయలు ఇంట్లో లేవు" అంది సుభద్ర వస్తున్న కోపాన్ని అణుచుకుంటూ.

"అయ్యో వంటక్కావలసిన సామాన్లన్నీ ఇంట్లో ఎల్లప్పుడూ వుంచుకోవాలమ్మా. ఇది లేదు, అది లేదు అన్న మాట నీ నోటంట రాకూడదు" చిన్న క్లాసు పీకింది మంగతాయారు.

"ఇదెక్కడి బాధరా బాబూ!" మనసులోనే విసుక్కుంది సుభద్ర.

సరిగ్గా నాలుగయ్యే సరికి రామానుజం ఇంటికొచ్చాడు. ఇంట్లో అడుగు పెడుతుండగానే ఆవిడ మాటలు వినిపించాయి.

"అమ్మో ఇంకా వుందా ఈ శాల్తీ?" అనుకున్నాడు మనసులోనే.

ఎంతో ఉత్సాహంగా వున్న అతని మనసు ఆవిడ్ని చూడగానే నీరుగారి పోయింది. తిన్నగా గదిలోకెళ్ళి బట్టలు మార్చుకుని "సుభద్రా" అని కేకేశాడు.

"మీ ఆయన ఎందుకో పిలుస్తున్నట్టు న్నాడు. వెళ్ళు" ఆవిడ పర్మిషను ఇచ్చింది. సుభద్ర లోపలికి వెళ్ళగానే,

"ఏంటి సుభద్రా! ఆవిడ ఇంకా ఇక్కడే వుందా? పంపించెయ్యకూడదూ?" విసుగ్గా అన్నాడు.

"ఎలా పంపించడమండీ? మెడ పట్టి గెంటలేం కదా! ఆవిడంతట ఆవిడ వెళ్ళిపోవాలిగాని" సుభద్ర కూడా విసుగ్గానే జవాబిచ్చింది.

"మనం సినిమాకెళ్దామని, నీకు నాకు, మన పిల్లలిద్దరికీ టిక్కెట్లు తెచ్చాను. ఇప్పుడెలాగ? ఆవిడ్ని ఎలాగోలా పంపించెయ్యి."

సుభద్రకి సరదాగా వుంది. ఆమె హాలుకెళ్ళి సినిమా చూసి చాలా కాలమైంది.

"అలాగే"

"ఏమిటి? ఏమైంది? అయన ఎందుకు పిలిచాడూ?"

"మొగుడు పెళ్ళాలన్న తర్వాత లక్ష వుంటాయి. అవన్నీ ఆవిడకెందుకు? ప్రతీది తనకే కావాలి" విసుక్కుంది మనసులో. పైకి మాత్రం అంది.

"ఆయన సినిమాకెళ్దామని మా కోసం కూడా టిక్కెట్లు తెచ్చేశారుట, సినిమాకి రమ్మంటున్నారు" అర్థం చేసుకుంటుందన్న ఆశతో



ధర్మకుడితో వివాదం!

ముందు చెప్పినట్లుగా కాకుండా తన పాత్ర పరిధిని తగ్గించి అన్యాయం చేశాడంటూ తమిళ దర్శకుడు సెల్వరాఘవన్‌తో గొడవ పడిందట నమిత. ధనుష్‌తో చేస్తున్న సినిమాలో నమితతో పాటు సోనియా అగర్వాల్ కూడా ఇందులో హీరోయిన్. సినిమా షూటింగ్ ప్రారంభ మయ్యాక తనకు చెప్పిన పాత్రని కుదించి సోనియా పాత్ర పరిధిని పెంచారని గ్రహించిన నమిత సెల్వ రాఘవన్‌తో గొడవకి దిగిందట. కానీ 'నా చేతుల్లో ఏమీ లేదంటూ' రాఘవ చేతులు దులుపుకున్నాడట!



హాయిగా.. ఆరోగ్యంగా జీవించేందుకు మార్గాలు

మనిషి మనుగడ హాయిగా, ఆరోగ్యంగా, ఆర్థిక సంపత్తితో సుఖంగా సాగేందుకు వారం వారం కొన్ని ప్రక్రియలు సులభతరంగా పాటించేవి అందజేస్తున్నాము. ఇవి మీ నిత్య జీవితంలో ఉపయోగించి సత్ఫలితాలను పొందగలరని ఆశిస్తున్నాం. - ఎడిటర్

అపామార్గం (ఉత్తరేణి)

వినాయక చవితి పూజలో ఏకవింశతి పత్రి పూజలో "అపామార్గ పత్రం పూజయామి" అని పూజ చేస్తాము. ఢిల్లీ నుంచి వారం వారం వెలువడే సరకేసరి అనే పత్రికలో రాసినది అపామార్గం అంటే ఉత్తరేణి మంచిరోజున (బుధ,గురు,శుక్ర వారాలలో) వేరుని తీసుకుని శుభ్రం చేసి పర్సులో ఉంచుకుంటే ధన లాభం కలుగుతుంది. ఈ 21 పత్రి (ఆకులు) ఓషధులు. ఉత్తరేణి వేరుని తావీజులో ధరిస్తే ఆరోగ్యానికి మంచిది. మీ ఇంట్లో దేవునివద్ద పెట్టుకుంటే సౌభాగ్యం. ఉత్తరేణికి గ్రహ దోషాలను నివారించే శక్తి ఉన్నది. అనుభవ పూర్వకంగా ఈ విషయం చూశాము. సుఖీనోభవంతు. - ఎ.పార్థసారధి, రామకృష్ణ

ఆవిడ కళ్ళల్లోకి చూసింది సుభద్ర. అలాంటి సూచనలేవీ కనబడలేదు ఆవిడ మోహంలో.

"మేం సినిమాకెళ్ళడానికి ఇంకా ఒక గంటే టైముంది. ఈ లోగా పిల్లలు స్కూలు నుంచి వచ్చేస్తే వాళ్ళని రెడీ చెయ్యాలి." మళ్ళీ అంది ఆశగా. ఇలాగైనా ఆవిడ లేచి వెళ్తాను అంటుందేమోనని. ఉహు మంగతాయారులో ఎలాంటి చలనం లేదు. ఆశ చావక మళ్ళీ మరొకసారి సినిమా వూసు ఎత్తింది ఆవిడ ముందు.

మంగతాయారు సుభద్ర జబ్బ పట్టుకుని కూర్చోబెడుతూ, "కూర్చుందూ సినిమా ఎప్పుడూ వుండేదే. వెధవ సినిమాలు ఎంతకని చూస్తావు? ఎంతసేపూ తన్నుకోవడం, కొట్టుకోవడం, పొడుచుకోవడం, ముద్దులు పెట్టుకోవడం. అలాంటి సినిమాలు చూడ్డం డబ్బు దండగ. పైగా కళ్ళు పాడవుతాయి. ఎంచక్కా మనం కబుర్లు చెప్పుకుందాం. నువ్వు వుండిపో. అంతగా కావాలంటే నీ మొగుడూ, పిల్లలూ వెళ్తారులే" అని బలవంతంగా కూర్చోబెట్టేసింది.

ఇహ సుభద్రకి ఏడుపొక్కటే తక్కువైంది.

"ఇదెక్కడి జిడ్డురా బాబూ!" అని మనసులో ఏ వందసార్లో అనుకుని వుంటుంది. మొత్తానికి సుభద్రని సినిమాకి వెళ్ళనివ్వకుండా చేసేసింది మంగతాయారు. రామానుజం, పిల్లలు సినిమాకెళ్ళి వచ్చిందాకా మంగతాయారు అలా కబుర్లు చెప్తూనే వుంది. రాత్రి భోజనం కూడా చేసి మరీ కదిలింది ఆవిడ. ఆ రోజు ఇంటికెళ్ళేసరికి మంచి తమాషా జరిగింది.

గ్రిల్స్ తలుపుకి తాళం వేసి వరండాలో ఈజీ చైర్‌లో కాళ్ళు ముడుచుకుని కూర్చుని కూనిరాగాలు తీస్తున్నాడు మంగతాయారు భర్త శ్రీనివాసరావు. రిక్షా దిగి వచ్చిన పెళ్ళాన్ని చూసి కూడా వులక లేదు పలక లేదు.

"ఏమండీ తలుపు తియ్యండి" అని ఎంత మొత్తుకున్నా అతను పట్టించుకోలేదు. ఎటో చూస్తూ కూర్చున్నాడు. మంగతాయారు సుమారు అరగంట సేపు తలుపు తియ్యమని బ్రతిమాలింది. ఆఖరికి అతను అన్నాడు, "నువ్వు రోజూ ఇల్లు పట్టకుండా తిరుగుతున్నావు. నీకు ఇల్లు వాకిలీ మొగుడూ పిల్లలూ సంసారం చట్టుబండలూ ఏమీ అక్కర్లేదు. వెళ్ళు. ఎక్కడికి వెళతావో వెళ్ళు. నేను తలుపు తియ్యను. ఏం చేస్తావో చేసుకో" అని నిష్కర్షగా, కుండ బద్దలు కొట్టినట్టుగా చెప్పేశాడు. ఏడుపంటే తెలీని ఆవిడకు కళ్ళంట నీళ్ళు తిరిగాయి. ఆవిడ లబోదిబోమని ఏడుస్తూ, తలుపు తియ్యమని మొగుడ్ని ప్రాధేయపడుతూనే వుంది. ఈ లోగా ఆ వీధిలోంచి వెళ్తున్న వాళ్ళు ఇరుగు పొరుగు వాళ్ళు ఏమైందోనని మూగారు. ఆవిడ సంగతి అందరికీ తెలుసు.

"పోనీ లెండి. పెద్దావిడ. మరెప్పుడూ అలా చెయ్యదు లెండి. ఈ ఒక్కసారికి క్షమించి తలుపు తియ్యండి" అని ఆవిడ తరఫున బ్రతిమాలేసరికి ఆఖరికి శ్రీనివాసరావు తలుపు తీశాడు.

ఆవిడ లోపలికి రాగానే ఆడ్డమైన తిట్లు తిట్టడం మొదలెట్టాడు శ్రీనివాసరావు.

"నీకసలు బుద్ధుందా? నువ్వు మనిషివేనా? నువ్వు పని, పాటా లేకుండా, మొగుడూ పిల్లల గురించి పట్టించుకోకుండా ప్రతిరోజు ఎవరో ఒకరింటికి వెళ్ళిపోతూ వుంటావు. కానీ వాళ్ళకి పన్లు వుండవనుకుంటున్నావా? అందరూ నీలాగే వుంటారా? వాళ్ళంతా నిన్ను చూసి ఎంత విసుగెత్తిపోతున్నారో, ఎంత అసహ్యించు కుంటున్నారో నీ మట్టి బుర్రకెక్కడం లేదు. అసలు నీకెందుకే ఈ పెత్తనాలన్నీ? ఎవరెలా పోతే నీకెందుకు? రేపట్నుంచి నువ్వు నోర్మూసుకుని ఇంట్లో పడి వుంటే వుండు, లేకపోతే నీ దారి నువ్వు చూసుకో. మంచిగా చెప్తే నీ బుర్రకెక్కదు" ఎప్పుడూ పల్లెత్తుమాట అనని అతను, నోట్లో నాలుక లేనట్లుగా వుండే అతను అన్ని మాటలు ఆడాడంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది.

అప్పట్నుంచి మంగతాయారులో కొంచెం మార్పు వచ్చింది. పూర్తిగా తిరుగుడు మానక పోయినా కొంచెం తగ్గించింది. మధ్యాహ్నం ఎవరింటికైనా వెళ్ళినా మొగుడు ఆఫీసు నుంచి ఇంటికి రాకముందే ఆవిడ ఇంటికి చేరుకుంటున్నది.

❋ ❋ ❋

అలాంటి మంగతాయారు చచ్చిపోయింది.

పాపం మంగతాయారు చచ్చిపోయే ముందు పక్షవాతం వచ్చి మూతి వంకర అయిపోయి నోరు పడిపోయింది. దాంతోపాటు కుడికాలు, కుడి చేయి కూడా చచ్చుపడిపోయి ఎందుకూ పనికి రాకుండా అయిపోయాయి. ఎంత విసుక్కున్నా, ఎంత తిట్టుకున్నా ఆవిడ చెప్పే కబుర్లు విని కాలక్షేపం చేసిన కొంతమంది మాత్రం ఆవిడ్ని చూడ్డానికి వచ్చారు. ఏదో మాట్లాడాలని వుంది ఆవిడకి. మాట్లాడలేదు.

పాపం ఆవిడ పరిస్థితి వర్ణనాతీతం. దారుణంగా వుంది.

అవిడ్ని హాస్పిటల్లో జాయిన్ చేశారు.

ఆవిడ మొగుడూ పిల్లలకీ ఎలాగూ పన్లు చేసుకోవడం అలవాటే. అందుకని వాళ్ళ పన్లు వాళ్ళు చేసుకుపోతున్నారు. ఆవిడకి కబుర్లు చెప్పే శక్తి ఆ దేవుడు ఎలాగో తీసేసుకున్నాడు. కనీసం కబుర్లు వినాలన్నా ఎవరొచ్చి ఆవిడ దగ్గర కూర్చుని తీరిగ్గా కబుర్లు చెప్తారు? హాస్పిటల్‌కి ఎవరూ వెళ్ళలేదు. పాపం పక్షవాతంతోపాటు కబుర్ల కోసం తపించిపోతూ ఆవిడ హాస్పిటల్లోనే కన్ను మూసింది.

ఆవిడ పోయిందని విన్న విశాల, సుభద్ర మాత్రం "అయ్యో పాపం" అనుకోకుండా వుండలేకపోయారు. ❋